# అనూహ్యం

వాస్తవానికీ కల్పనకీ మధ్యన ఉండే రేఖ బహు సన్నటిది. ఒకోసారి ఆ రేఖ అసలు కరిగిపోతూ ఉంటుందేమో – వాస్తవం కల్పనలోకీ కల్పన వాస్తవంలోకీ ఒరిగి కలగాపులగంగా కలసిపోతాయేమో!

ఇల్లాంటి ఆలోచనలు రావడం – కొన్ని అనారోగ్య లక్షణాలు అనారోగ్యం కంటె ముందరే పొడచూపినట్టు రాబోయే దుస్థితుల నల్లనీడలు ముందే ఆవరించడంలాంటిది. అయితే శాస్త్ర విజ్ఞానం దీన్ని నమ్మకపోవడం వల్ల ఇలాంటి విషయాలు బయటకి చెప్పి ప్రయోజనం లేదు. చెప్పి చెయ్యగలిగినదీ ఏమీ ఉండదు.

అసలు ఈ ఆలోచనలు రావడానికీ, మనసు పరిపరి విధాల పోవడానికీ కారణం అతను – ఆ బ్రాహ్మడు – ఆ బికారి. అతను గురించి ఇంతకు ముందు రాశాను. రాయకుండా ఉండలేకపోయాను. మళ్లీ రాస్తున్నాను.

ముట్టుకుంటే అంటుకునేటట్టున్న మురికి పంచె, దాని మీద మరొకటి – కళ్లు లోపలికి చొచ్చుకొని పోయి దవడలు బిగించి ఉండడం వల్ల పళ్లు బిగించినట్లు ప్రపంచం మీద ద్వేషంలా కనబడుతుండే ఆకలీ, ఎవరినీ నమ్మలేకపోవడం – భయం కారణంగా బెదురు చూపులు, చిట్లించిన నుదురూ, ముక్కుపుటాలెగరేస్తూ రేగుతున్న పొట్టేలులా భీకరంగా, అసహ్యంగా, దీనంగా, రోతగా, అనారోగ్యంగా ఉన్న మనిషి.

అరుగు మీద వచ్చి కూచుంటాడు. తలుపు తీసి ఉంటే లోపలకు చూస్తూ ఉంటాడు. లోపలకి పిలిచి వడ్డిస్తే తింటాడు – మరేవి ఇచ్చినా అక్కడే తింటాడు. ఏదీ ఇవ్వకపోతే మంచినీళ్లు అడిగి తాగుతాడు. ఏమీ ఇవ్వకుండా పొమ్మంటే అందరూ ఫోఫో అంటారు – ఎక్కడికి పోవడం అని ఎదురు ప్రశ్న వేస్తాడు. మొండికెత్తి కోపం తెచ్చుకుని అసహ్యించుకుని పొమ్మని కసిరితే, గుడ్లురిమి చూస్తాడు – కొంతసేపు గుర్రుగా చూసి వెళ్లిపోతాడు. ఎక్కడెక్కడో తిరుగుతాడు. ఇరవై నాలుగు గంటలూ అతని ఆస్తి సర్వస్వమూ అయిన మూట భుజాన్ని అలాగే తగిలించుకుని మరీ తిరుగుతాడు.

పది సంవత్సరాల క్రిందటి మాట! అప్పటికి అమ్మ కూడా ఉండేది. ద్వాదశినాడు భోజనానికి వస్తూ ఉండేవాడు. దరిద్ర నారాయణుడు అంటే ఇలాగే ఉంటాడు కాబోలు అంటుండేది అమ్మ – ఏమో! దరిద్ర నారాయణుణ్ణి చూసిన వాళ్లెవరు? ఆకలిలో ఉన్న వాడికి అన్నం పెట్టడం ధర్మాలన్నింటిలోకీ పరమ ధర్మం అని మన సంస్కృతిలో పుట్టిన ఎవరికీ చెప్పనక్కరలేకుండానే తెలుసు.

అల్లాంటి మనిషిని అసహ్యించుకునే హక్కు మనకి లేదనీ తెలుసు. అయినా విసుక్కుంటాం. కసురుకుంటాం. అది మామూలు మనిషి లక్షణం.

''ఫో... ఫో... ఇక్కడెందుకు కూచుంటావ్! అరుగు మీద నేను కూచోవాలి! కంపుకొడుతున్నావ్ ఫో... రోజూ ఎవరు వేస్తారు? ఎవరు వెయ్యగలరు'' ముసలాయన చీదరించుకున్నాడు.

కొన్ని సంవత్సరాలుగా ఆ దృశ్యం చూసిన తరువాత అసలు అతన్ని చీదరించుకుని ఛీత్కారం చేయడానికి మనకి హక్కుందా అనిపించింది. హఠాత్తుగా, నిర్హేతుకంగా!

అంతే ఆ ఆలోచనతో భయమూ వేసింది.

మూట బ్రాహ్మడి మీద జాలి అంత హఠాత్తుగా రావడానికి కారణం ఏమిటి? నిజంగా అది

జాలి అనదగిన బాధేనా ?

లేక ముసలాయన మీద ద్వేషమా ? ముసలాయన బ్రతుకుకి ఉండి, మూట బ్రాహ్మడి బ్రతుకికి లేని అర్థం ఏదయినా ఉందా ? ఉంటే ఏమిటా అర్థం ?

ముసలాయనకీ పిల్లా పాపాలేరు - ఆ రెండో మనిషికీ ఎవరూ లేదు. చనిపోతే ఏడిచే వాళ్లంటూ ఎవరూ, ఇద్దరికీ లేరు. కాకపోతే ముసలాయనకి అన్న వస్త్రాలకి యాచన అవసరం లేకుండా కించిత్తు ఠికాణా ఉంది కాబట్టే కదా అతను మూట మనిషిని చూసి ఛీత్కరించడం ?

ఈ తర్కంలోంచి వచ్చింది వెలుగు కిరణం - ప్రయోజనాలెవరు తెలుసుకోగలరు ! ఇద్దరి బ్రతుకులకూ ప్రయోజనం మామూలుగా కనబడదు. వాళ్లు పోవడం వల్ల వచ్చే కష్టం కాని, దుఃఖం కానీ ఉన్నట్టు లేదు - ఇద్దరూ ఎవరికీ అక్కరలేని వాళ్లే - కానీ ఇద్దరూ ఉన్నారు కావలసిన వాళ్లెందరున్నా ఉండని వాళ్లుండరు - దానికెన్ని నిదర్శనాలు కావాలి !

కనిపించే వయసున్న వాళ్లు - చదువు, సంపాదన ఉన్నవాళ్లు పిల్లలూ బాధ్యతలూ ఉన్నవాళ్లు చటుక్కున మటుమాయమవుతూ ఉంటే ఇల్లాంటి వాళ్లుపోయిన వాళ్ల ఆయుషు కూడా పోసుకుని బ్రతుకు ఈడిగిలపడుతూ వెళ్లమారుస్తూ ఉంటే ఆలోచనలతో శపించబడిన మనసులకి ఆరాటం ఎలా తప్పుతుంది ? తెల్లవారింది - పేపర్లో భోగట్టా - కారు ప్రమాదం - ఆ వార్త చదువుతుండగానే రేడియోలో శ్రవణేంద్రియానికీ అదే వార్త.

ఢిల్లీలో లారీ కారును ఢీ కొంది. అందులో ప్రయాణం చేస్తున్న కుటుంబంలో యజమాని అక్కడికక్కడే మరణించాడు. భార్య తీవ్రంగా గాయపడింది. ఇద్దరు బిడ్డలకీ స్వల్పమైన గాయాలు తగిలాయి. భార్యను ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో చేర్చారు.

ప్రమాదంలో మరణించినాయన సురేష్ ఓ పెద్ద పోలీసు అధికారి. గుండె ఝల్లుమంది.

భార్యా, భర్తా ఇద్దరూ బాగా తెలిసిన వాళ్లు. నాకు - నాకే కాదు మా కుటుంబానికంతటికీ పరిచయం కలిగిన కొద్ది రోజులలో ఆత్మీయులయిపోయిన వాళ్లు. అరమరికలు లేకుండా కలసి భోజనాలు చేసి అంతస్తులూ, హోదాలు అడ్డుగోడలై పోకుండా అతి సన్నిహితమైన బంధువుల్లా మా ఇంట తిరిగి వాళ్లింట మమ్మల్ని ఆదరించిన వాళ్లు.

మా కుటుంబాల మధ్య పరిచయం సురేష్‌తో నా పరిచయంతో మొదలైంది. మొహాలు చూసుకున్న వేళా విశేషం అంటారు. అంతే అయి ఉండాలి. నా పూర్వ విద్యార్థి నా గురించి ఏం చెప్పాడో ఏమో నేనంటే ఎంత గౌరవమో అంతే అభిమానం చూపించాడు. దీనికి కొంతవరకూ కారణం పూర్వాశ్రమంలో అతనూ ఆంగ్ల సాహిత్యం చదవడం, అధ్యాపకుడిగా పనిచెయ్యడం. అతని ఉద్యోగంలోని సాధక బాధకాలను గంటల తరబడి నవ్వుతూ తన మీద తనే ఒక విధంగా జాలిపడుతూ నన్ను చూసి మృదువుగా ఈర్ష్య చెందుతూ చెప్పేవాడు. ఫోనులో అతన్ని పట్టుకోవడం కష్టమే. అయినా దొరికితే చాలాసేపు కబుర్లు చెప్పేవాడు. మా ఇంటికి పిలిచాను కొంచెం బెదురుతూనే. వాళ్లు చేసే ఉద్యోగాలు అల్లాంటివి. ఎవరేమనుకుంటారో అని కొంచెం బెరుకు.

బాత్‌రూంలో ఉన్నా వయిర్‌లెస్ ప్రాణం తింటూనే ఉంటుంది. పది గజాలు వెళ్లాలన్నా ఎవరెవరికో చెప్పి అనుమతి పొందాలి. ఎవరితోనూ చెప్పకుండా వచ్చేశా. ఓ గంట కులాసాగా మామూలు మనిషిలా బ్రతకాలని కాఫీ తాగాలని ఉంది.

అలా ఎవరంటారు ? ఎవరుంటారు !

వెన్నెట్లో టెర్రస్ మీద జంబుఖానా పరుచుకుని కూచున్నాం. సురేష్ భార్య అరుణకి మా ఆవిడ దసరాల్లో చేసే పేరంటం గురించి సగం తెలుగులోనూ సగం హిందీలోనూ చెబుతోంది.

ఇక వాళ్లిద్దరి స్నేహమూ అదో అద్భుతం. సామాన్య గృహిణి. అట్టే చదువుకున్నది కాదు అవతల మనిషి పెద్ద అధికారి, క్రింద వాళ్లందరినీ హడలుగొట్టించే చాకులాంటి అధికారి. మా ఇంట్లో మా మధ్యన కూచుని ఉండగా ఆమెను చూస్తే ఆవిడ అసలు చదువుకుని ఉద్యోగం చేసే మనిషిలా కనబడదు.

క్రింద గదిలో ఫోను మోగింది. పిల్లలెవరో ఎత్తి ' ఆంటీ ! ఫర్... యూ !'' అన్నారు.

''సారీ !'' అంటూ ఆవిడ లేచి వెళ్లింది.

''మర్డర్ కేసుట... నే వెళుతున్నా...''

సురేష్ కూడా లేచాడు. ' ఇదీ మా బతుకు.. ఎవరికీ చెప్పకుండా వచ్చాను..''

'' ఒక్క ఎమర్జన్సీలోనే పిలవమని చెప్పి నంబరిచ్చాను'' అంది ఆమె బాధగా.

సామాన్యులు ఉన్నతులని ఆదరించి అభిమానించడంలో ఆశ్చర్యం లేదు. ఉన్నతులు సామాన్యుడ్ని సోదరులుగా ప్రేమించడంలోనే ఉంది ఆశ్చర్యం. అంతస్తులను పక్కకు నెట్టి ఆత్మీయతను అందించడం ఆశ్చర్యం కదూ ! మేం వాళ్లకివ్వగలిగినదేముంది ?

''అమ్మా, నాన్నగారూ కూడా వచ్చారు. అమ్మ వస్తానంటోంది. వాళ్లని తీసుకురావచ్చా'' అంది అరుణ. మన ఆచారాలూ, వ్యవహారాలూ, కట్టూ, బొట్టూ, పద్ధతులూ తెలియవనుకున్న మనిషి మా ఆవిడ పేరంటానికీ, బొమ్మల కొలువు చూడడానికీ రమ్మని ఫోనులో చెప్పినపుడు.

ఆరున్నరయేసరికి తలమీద ఎర్రదీపం ఉన్న కారు వచ్చింది. పోనీ మాతో ఆ భార్యాభర్తలకు కొంత పరిచయం ఏర్పడింది. నిజమే సన్నిహితులయ్యారు. వచ్చిన వృద్ధదంపతులతో... బొబ్బట్లు తింటూ ఎలా ఛేస్తారని అడిగింది అరుణ పేరంటం సందడిలోనే....

వట్టి మనిషి కాదనీ చెప్పిందట. సరే ! మన పద్ధతిలో లాంఛనంగా వెళ్లి ఆమెకు బొబ్బట్లూ పువ్వులూ, పళ్లు ఇచ్చి వచ్చాం.

క్యారియర్‌లో మరుసటి రోజు పెరుగువడలు పంపించింది. అరుణ ''నేనే చేశాను !'' అందట తెలుగులో మా ఆవిడతో ఫోన్‌లో

హఠాత్తుగా ఇప్పుడు ఈ వార్త....

ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ అఖిల భారత వైద్య సంస్థాన్‌కి ఫోను చేస్తే ? అరుణ ఎలా ఉందో...

ఆమెను ఓదార్చడం సాధ్యమే !

మేమెవరమని చెప్పుకోవాలి - మాలాంటి వాళ్లు ఆమె స్నేహితుల్లో, ఆప్తులలో ఎందరో... ఆమె మాటాడే స్థితిలో ఉందా ? ఉంటుందా ?

ఎందుకో తెలియకుండా హఠాత్తుగా గుర్తుకొస్తున్నారు. ఆ దంపతులు - వారి చిన్న బిడ్డ - ఎవరి బ్రతుకుకి ఏ అర్థం ఉందో తెలుసుకోగలిగితే మనమూ దేవతలమే అయిపోమూ !

చిరునవ్వు చెరగని మొహంలో కళ్లజోడులోంచి మిలమిలలాడుతున్న కళ్లతో నల్లటి మీసం మునివేళ్తో సవరించుకుంటూ 'సాహిత్యం చదువుకోవాలనీ, పి.హెచ్.డీ చెయ్యాలనీ ఉంది. నన్ను గైడ్ చెయ్యకూడదూ !' అంటున్న సురేష్. నుదుటన పడుతున్న జుట్టును బడి పిల్లాడిలా మీదకి

తోసుకుంటూ ముక్కుపుడక జిగేల్మంటుంటే 'అబ్బ, ఇంకెన్నాళ్లు ఈ బరువు' అంటున్న గర్భిణీ అరుణ.

సైకిల్ చక్రం తిప్పుతున్న అనునయ్ వీళ్లని మరచిపోలేం. అనునయ్‌ని వాళ్ల చెల్లితోపాటూ చూడగలమేమో ! సురేష్ ఎందుకు పోవాలి ? ముసలాయనా, ముతకాయనా ఎందుకుండాలి ?

ఈ రెండింటికీ సమాధానాలు లేవు. ఉండవు. సమాధానాలు వెతకడం అవివేకం – అదెందుకంటే అందుకే ! ఇదే సత్యం – సత్య దర్శనమూ భాగ్యఫలమే – సురేష్ ఆత్మకి భగవంతుడు శాంతి ప్రసాదించుగాక !

**గీతాంజలి**

మే 31, 1995